ప్రజాశక్తి
సోమవారం 21 నవంబర్ 2022
5
విజయనగరం

ఎన్‌ఎస్‌ఎస్ జిల్లా పిఒగా చంద్రశేఖర్

ప్రజాశక్తి-విజయనగరం
జాతీయ సేవా పథకం (ఎన్‌ఎస్‌ఎస్) జిల్లా పిఒగా మహారాజా కళాశాల రసాయనశాస్త్ర సహ ఆచార్యులు గురుబిల్లి చంద్రశేఖర్ నియమితుల య్యారు. చంద్రశేఖర్‌ని నియమిస్తూ ఆంధ్రా యూనివర్సిటీ ఎన్‌ఎస్‌ఎస్ సమన్వయకర్త ప్రొఫెసర్ హరనాథ్ ఆయనకు ఉత్తర్వులు అందజేశారు.

నియామకపత్రాన్ని అందుకుంటున్న చంద్రశేఖర్

ఐక్య ఉద్యమాలతోనే.. కార్మికవర్గ సమస్యలు పరిష్కారం

కార్మిక ప్రదర్శనలో సిఐటియు నాయకులు, కార్మికులు, ఉద్యోగులు, స్కీమ్‌వర్కర్లు

సభలో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు

కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తోన్న మోడీ ప్రభుత్వం
కేంద్రానికి తందానతాన అంటున్న జగన్ సర్కారు
సిఐటియు బహిరంగ సభలో వక్తలు

ప్రజాశక్తి-విజయనగరంప్రతినిధి/శంగవరపుకోట

ఐక్య ఉద్యమాలతోనే కార్మికవర్గ సమస్యలు పరిష్కారమౌతాయని వక్తలు పేర్కొన్నారు. దేశంలో మోడీ సర్కారు కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుంటే, రాష్ట్రంలోని జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం తందానతాన అంటోందని విమర్శించారు. సిఐటియు పదో జిల్లా మహాసభ ఎస్.కోటలో ఆదివారం ఉత్సాహంగా ప్రారంభమైంది. దీనికి ముందు ఎస్.కోట మెయిన్ రోడ్డులో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం ఎన్‌టిఆర్ సర్కిల్లో సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.అప్పలసూరి అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, జిల్లా ప్రధాన కార్యదర్శి టివి రమణ, ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ప్రసంగించారు.

సిఐటియు జెండాను ఎగురవేస్తున్న విశ్వనాథరాజు

ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ శక్తుల ప్రయోజనాల కోసం కార్మిక వర్గంపై దాడి చేస్తోందని విమర్శించారు. ఇటువంటి విధానాల వల్ల కార్మికులకు మెరుగైన వేతన విధానం అమలుకావడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా కొనుగోలు శక్తి తగ్గి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. ధరల నియంత్రణ మాటే లేకపోవడం వల్ల మోడీ హయాంలో గ్యాస్ ధర రూ.400 నుంచి రూ.1200కి, పెట్రోల్ ధర రూ.60 నుంచి రూ.120కి పెరిగాయన్నారు. ఇలా అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెరిగిపోయాయని వివరించారు. ఇటువంటి పర్యావసానాల వల్లే మరోవైపు కొన్ని పరిశ్రమలు మూతపడుతున్నాయన్నారు. నష్టాల పేరిట విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను విదేశీ బహుళజాతి కట్టబెట్టేందుకు సిద్ధపడినప్పటికీ సిఎం జగన్ గానీ, జనసేన నాయకుడు పవన్ కల్యాణ్ గానీ ఎందుకు ప్రశ్నించడం లేదో చెప్పాలని డిమాండ్ చేశారు. పేదలపై చెత్త భారం మోపిన ఘనత జగన్ ప్రభుత్వానికే దక్కిందని ఎద్దేవా చేశారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని, పెరిగిన ధరలు తగ్గించాలని ఏప్రిల్ 5న తలపెట్టిన చలో పార్లమెంట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

సుబ్బరావమ్మ మాట్లాడుతూ భవన నిర్మాణ రంగ కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, అసంఘటితరంగ కార్మికులకు సమగ్ర చట్టం చేయాలని, స్కీమ్ వర్కర్లను ప్రభుత్వం ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పాలకుల విధానాల వల్ల కార్మికులు, పేదలు మరింతగా అణచివేతకు గురయ్యారని ఆవేదన వ్యక్తంచేశారు. జగన్ ప్రభుత్వం సచివాలయానికి ఒక ఆశా కార్యకర్త అంటూ వారిని తగ్గించేందు కుట్ర పన్నుతోందన్నారు.

తమ్మినేని సూర్యనారాయణ మాట్లాడుతూ పాలకుల విధానాల వల్ల జిల్లాలోని కొత్తవలస, బొబ్బిలి, విటి అగ్రహారం, సారిపల్లి పారిశ్రామిక వాడలు కళావిహీనంగా మారాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఫెర్రో, జ్యూట్, చక్కెర పరిశ్రమలు మూతపడడం వల్ల సమారు 20 వేల కుటుంబాలు ఉపాధి కోల్పోయాయని వివరించారు. సాగునీటి వనరులను అభివృద్ధి చేయకుండా రైతాంగాన్ని కూడా విస్మరించిందన్నారు. పార్టీల జెండాలు మారినా వారి అజెండా మాత్రం ఒక్కటిగానే ఉందన్నారు. బొబ్బిలిలో ఉపాధి భద్రత కోసం పోరాడిన 40 మంది మహిళా కార్మికులను వైసిపి ప్రభుత్వం అక్రమంగా అరెస్టులు చేసి జైలుకు పంపిందన్నారు. ఈ నేపథ్యంలో కార్మికులంతా ఐక్యంగా ముందుకు సాగాలని కోరారు.

స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న సుబ్బరావమ్మ

బహిరంగసభకు హాజరైన జనం

ఆకట్టుకున్న కోలాటం

ఉత్సాహంగా.. ఉల్లాసంగా..

ఎస్.కోటలో భారీ ప్రదర్శన ● ప్రారంభమైన సిఐటియు జిల్లా మహాసభ

డప్పుల దరువులు.... కోలాటాల కోలాహలం... నృత్య ప్రదర్శనలు... ఎర్ర జెండాలతో కార్మికుల కవాతు నడుమ సిఐటియు జిల్లా పదో జిల్లా మహాసభ ఎస్.కోటలో ఆదివారం అత్యంత ఉత్సాహ పూరిత వాతావరణంలో ప్రారంభమైంది. ఎర్ర జెండాలు, తోరణాలతో ప్రధాన రహదారి ఎరుపెక్కింది. కార్మిక వ్యతిరేక విధానాలపై నినాదాలతో ఆ ప్రాంతమంతా మారుమోగింది. జిల్లా వ్యాప్తంగా వివిధ రంగాలకు చెందిన కార్మికులు, స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల కలయిక, పరస్పర కరచాలనాలతో మహాసభ ప్రాంగణం ఎంతో సందడిగా కనిపించింది.

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి, శృంగవరపుకోట

సిఐటియు జిల్లా మహాసభలో భాగంగా తొలిరోజు ఆదివారం శృంగవరపుకోట పట్టణంలోని పోతనాపల్లి కూడలి నుంచి ఆర్‌టిసి కాంప్లెక్స్ మీదుగా ఎన్‌టిఆర్ విగ్రహం వరకు తొలుత ప్రదర్శన నిర్వహించారు. ప్రదర్శనలో వేలాదిమంది కార్మికులు, చిరుద్యోగులు భాగస్వామ్యయ్యారు. కార్మిక వర్గ ఐక్యత వర్ధిల్లాలంటూ నినదించారు. సిఐటియు జిందాబాద్, కార్మికుల నష్టం చేకూర్చే విధానాలు విడనాడాలంటూ చేసిన నినాదాలు మిన్నంటాయి. ఎన్‌టిఆర్ సర్కిల్‌లో జరిగిన బహిరంగ సభలో సిఐటియు రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, రాష్ట్ర ఉపాధ్యక్షులు వి.ఉమామహేశ్వరరావు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.అప్పలసూరి, టివి రమణ, జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ ప్రసంగించారు. అనంతరం పట్టణంలోని తిరుమల సాయి ఫంక్షన్ హాల్లో ప్రతినిధుల సభ ప్రారంభమైంది.

ప్రతినిధుల సభకు ముందు మహాసభల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సిఐటియు పతాకాన్ని యూనియన్ సీనియర్ నాయకులు విశ్వనాథరాజు ఆవిష్కరించారు. అనంతరం ప్రతినిధులంతా అమరవీరుల స్థూపం వద్ద పూలు వేసి నివాళులర్పించారు. కీర్తిశేషులు, సిపిఎం పార్వతీపురం జిల్లా పూర్వ కార్యదర్శి రెడ్డి శ్రీరామ్మూర్తి, యుటిఎఫ్ రాష్ట్ర పూర్వ కార్యదర్శి కె.శేషగిరి, గత మూడేళ్లలో మరణించిన కార్మికులు, నాయకులకు మహాసభ నివాళులర్పించింది. సిఐటియు జిల్లా అధ్యక్షులు జి.అప్పలసూరి, ఉపాధ్యక్షులు అంబళ్ల గౌరినాయుడు, అనసూయ, శంకరరావు అధ్యక్ష వర్గంగా వ్యవహరించారు. ప్రతినిధుల సభలో సిఐటియు ఆఫీస్ బేరర్లు యుఎస్ రవికుమార్, రమణ, కాంతారావు, జగన్మోహన్ పాల్గొన్నారు.

ఆస్పత్రుల అభివృద్ధికి పెద్దపీట

ఆస్పపత్రుల అభివృద్ధికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి జి.నాగభూషణరావు వెల్లడించారు. ఇప్పటికే ఆస్పత్రుల అప్‌గ్రేడ్‌కు అనుగుణంగా సిబ్బంది నియామకాలు చేపట్టినట్లు తెలిపారు. త్వరలో వివిధ విభాగాల వైద్యుల పోస్టులు కూడా భర్తీ కానున్నాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం మరింతగా పెరిగిందని, అందుకు అనుగుణంగా ఇన్‌పేషెంట్లు, ఔట్‌పేషెంట్ల సంఖ్య పెరిగిందని స్పష్టంచేశారు. ప్రస్తుతం చేపడుతున్న నిర్మాణ పనులు పూర్తయితే అన్ని సమస్యలూ పరిష్కారమౌతాయని, మరింత సమర్థవంతంగా వైద్యారోగ్య సేవలు అందించేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. ఈ వారం తనను కలిసిన ప్రజాశక్తికి ముఖాముఖీ ఇంటర్వ్యూ ఇచ్చారు. ఆ ఇంటర్వ్యూ వివరాలు..

– ప్రజాశక్తి, విజయనగరం ప్రతినిధి

- నాబార్డ్, నీతి అయోగ్ నిధులు భారీగా కేటాయింపు
- పెరిగిన ఒపి, ఐపిలు
- త్వరలో వైద్యుల భర్తీ
- పూర్తిస్థాయిలో సిబ్బంది
- 'ప్రజాశక్తి'తో జిల్లా ఆస్పత్రుల సమన్వయ అధికారి నాగభూషణరావు ముఖాముఖి

ముఖాముఖి

మీ పరిధిలోని ఎన్ని ఆస్పత్రులు ఉన్నాయి?.

నా పరిధిలో ఎస్.కోట, గజపతినగరం, రాజాం ఏరియా ఆస్పత్రులు, నెల్లిమర్ల, సుందరపేట, బొబ్బిలి, బాడంగి, చీపురుపల్లి సామాజిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. ప్రస్తుతం ఏరియా ఆస్పత్రులుగా ఉన్న మూడూ గతంలో కమ్యూనిటీ హెల్త్ సెంటర్లుగా ఉండేవి. ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం వీటిని అప్‌గ్రేడ్ చేసింది.

ఏయే ఆస్పత్రిలో ఎన్ని పడకలు ఉన్నాయి? .

గజపతినగరం, ఎస్.కోట, రాజాం ఆస్పత్రుల్లో 50చొప్పున పడకలు ఉండేవి. ఏరియా ఆస్పత్రులుగా అప్‌గ్రేడ్ చేసిన తరువాత పడకల సంఖ్య 100కు పెరిగింది. నెల్లిమర్ల, భోగాపురం సిహెచ్‌సిల్లో 30 చొప్పున, బొబ్బిలి, చీపురుపల్లి, బాడంగి సిహెచ్‌సిల్లో 50 చొప్పున పడకలు ఉన్నాయి.

ఆస్పత్రి స్థాయి, పడకలు, సిబ్బంది సంఖ్యకు తగ్గట్టు వసతులు ఉన్నాయా?.

ప్రస్తుతం వసతి సమస్య ఉన్నప్పటికీ దాన్ని అధిగమించేందుకు ప్రభుత్వం నీతిఅయోగ్, నాబార్డ్ ద్వారా నిధులు కేటాయించింది. ప్రస్తుతం ఆ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఆ పనులు పూర్తయితే ఇన్, ఔట్ పేషెంట్లకు, సిబ్బందికి వసతి సమస్య తీరుతుంది. లేబోరేటరీ, ఫార్మా తదితరాల నిర్వహణకు కూడా ఇబ్బంది లేకుండా ఉంటుంది.

నిధుల కేటాయింపు ఏ విధంగా ఉంది?.

ప్రస్తుతం కేటాయించిన నిధులతో కార్పొరేట్‌కు ధీటుగా ఆస్పత్రులు అభివృద్ధి చెందుతాయి. గజపతినగరం ఏరియా ఆస్పత్రికి రూ.17 కోట్లు, ఎస్.కోట ఏరియా ఆస్పత్రికి రూ.12.60 కోట్లు, రాజాం ఏరియా ఆస్పత్రికి రూ.6.80 కోట్లు, బాడంగి సిహెచ్‌సికి రూ.8.81 కోట్లు, నెల్లిమర్ల సిహెచ్‌సికి రూ.4.42 కోట్లు, సుందరపేట సిహెచ్‌సికి రూ.3.95 కోట్లు చొప్పున నాబార్డ్ నిధుల నుంచి కేటాయించారు. ఇవి కాకుండా నెల్లిమర్ల, సుందరపేట, బొబ్బిలి, చీపురుపల్లి, బాడంగి సిహెచ్‌సిలకు నీతి అయోగ్ ద్వారా మరో రూ.17.50 కోట్లు కేటాయించారు. నాబార్డ్ నిధులతో ప్రస్తుతం పనులు జరుగుతున్నాయి. నీతి అయోగ్ నిధులు ఇంకా వినియోగంలోకి రావాల్సి ఉంది.

రోగుల తాకిడి ఎలా ఉంది?.

ప్రభుత్వ ఆస్పత్రులంటే ప్రజలకు నమ్మకం పెరిగింది. నాణ్యమైన వైద్యసేవలు అందుతున్నాయి. అందుకు తగ్గట్టే వైద్యుల సంఖ్యను ప్రభుత్వం పెంచుతోంది. దీంతో, ఏరియా ఆస్పత్రుల్లో నెలకు సగటున 1800 వరకు ఒపి ఉంటోంది. ఇన్‌పేషెంట్లు 1700 వరకు ఉంటున్నారు. సిహెచ్‌సిల్లో నెలకు 725 నుంచి 1300 వరకు ఒపి ఉంటోంది. ఐపి 600 నుంచి 1000 వరకు ఉంటోంది.

రోగులకు తగ్గట్టు వైద్యులు, సిబ్బంది ఉన్నారా?.

సిబ్బంది అయితే పూర్తిస్థాయిలో ఉన్నారు. జిల్లా కేంద్ర ఆస్పత్రిని మెడికల్ కాలేజీకి అప్పగించిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో వైద్య విధాన పరిషత్ ఆధ్వర్యాన ఇక్కడ పనిచేస్తున్న 22 మందిలో నలుగురు మినహా మిగిలిన వారిని మా పరిధిలోని ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రులకు బదిలీ చేశారు. కానీ, ఇప్పటి వరకు వారిని మెడికల్ కాలేజీ యాజమాన్యం రిలీవ్ చేయకపోవడం వల్ల కొంత సమస్య ఉన్న మాట వాస్తవమే. వారంతా రిలీవ్ అయ్యి ఆస్పత్రుల్లో చేరితే చాలా వరకు సమస్య పరిష్కామౌతుంది.

మా పిల్లలు కాదు కదా!

పేద విద్యార్థులకు నిలయం ఆ విద్యాసంస్థలు. అక్కడి ఆవరణమంతా తుప్పలు, డొంకలే. ఎప్పటికప్పుడు విషసర్పాలు, క్రిమికీటకాలు దర్శనమిస్తుంటాయి. ఆటస్థలమూ కరువాయే. ఎప్పుడు ఏ ముప్పు ముంచుకొస్తుందోనని విద్యార్థులు, సిబ్బందిలో ఆందోళన. అధికారులకు వినతులు అందించినా, విన్నపాలు చేసినా ఇంతవరకూ తీసుకున్న చర్యలు మాత్రం సున్నా. ఏళ్ల తరబడి అధికారుల నిర్లక్ష్యానికి తార్కాణమిది.

విద్యార్థుల ఇబ్బందులను గుర్తించిన ఓ సామాజిక కార్యకర్త.. సమస్యలపై స్పందనలో కలెక్టర్ సూర్యకుమారికి వినతి అందించారు. వెంటనే స్పందించిన కలెక్టర్ పరిష్కారానికి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కానీ, పనులు మాత్రం కాలేదు. ఎక్కడి పిచ్చిమొక్కలు అక్కడే ఉన్నాయి. ఇంతలో సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడు నుంచి పనులు పూర్తయినట్లు కలెక్టర్‌కు నివేదిక అందింది. ఆ విషయాన్ని ప్రిన్సిపల్స్ చెప్పినట్లు అందులో పేర్కొన్నారు. విధుల్లో ఇష్టారాజ్యం, బాధ్యతారాహిత్యానికి నిదర్శనమిది.

ఎందుకంటే? అక్కడ చదువుతున్నది వారి పిల్లలు కాదు కదా!.

- సమస్యల పరిష్కారంలో అధికారుల నిర్లక్ష్యం
- విధుల్లో సమగ్ర శిక్ష ఎపిసి ఇష్టారాజ్యం
- బాధ్యతలు విస్మరించిన వైనం
- స్పందన దరఖాస్తుపై కలెక్టర్‌కు తప్పుడు సమాచారం
- తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్న విద్యార్థుల తల్లిదండ్రులు

గురుకుల పాఠశాల ఆవరణలో పిచ్చిమొక్కలు

ప్రజాశక్తి-వేపాడ

వేపాడ మండలంలోని బక్కునాయుడుపేట వద్ద డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం, ఎపి ఆదర్శ పాఠశాల ఉన్నాయి. గురుకులంలో 680 మంది, ఆదర్శ పాఠశాలలో 600 మందికి పైగా విద్యార్థులు విద్యనభ్యశిస్తున్నారు. విద్యార్థినీ విద్యార్థులకు కావాల్సినంత ఆట స్థలం ఉంది. కానీ ఆటలు ఆడుకొనేందుకు వీలుకాదు. ఆవరణమంతా దట్టమైన ముళ్లపొదలు, ఆట స్థలమంతా రాళ్ల కంకరతో నిండి ఉంది. ఆటలు ఆడే సమయంలో ఏమాత్రం కాలుజారినా గాయాలపాలయ్యే అవకాశముంది. ముళ్లపొదలు, దట్టమైన డొంకలు పెరగడంతో విషసర్పాలు, కీటకాలు నిత్యం సంచరిస్తుంటాయి. విద్యార్థులకు ప్రాణహాని కలిగే అవకాశముంది. కురుపాంలో వసతిగృహంలో పాముకాటు ఘటనను నేటికీ మరిచిపోలేం. పిచ్చిమొక్కలు తొలగించి, మైదానాన్ని చదును చేయించాలని విద్యార్థులు, అక్కడి సిబ్బంది అనేకమార్లు అధికారులు, ప్రజా ప్రతినిధులకు వినతులు అందజేశారు. అయినా చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామంటున్న సర్కారు ఆ దిశగా ఈ విద్యాలయాల్లో తీసుకున్న చర్యలు మాత్రం లేవు.


సమస్య పరిష్కరించినట్లు పంపిన లేఖ

పనిచేయకుండానే.. తప్పుదోవ

ఈ నేపథ్యంలో ఉపాధి హామీ ద్వారా నిధులు మంజూరు చేసి ఆ రెండు విద్యాలయాల మైదానాలను చదును చేసి, ఆట స్థలాలను అందుబాటులోకి తీసుకురావాలని ఈ నెల ఏడో తేదిన సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు స్పందనలో కలెక్టర్‌కు దరఖాస్తు చేశారు. వెంటనే స్పందించిన కలెక్టర్... గురుకుల, ఆదర్శ పాఠశాలలను పరిశీలించి, 30 రోజుల్లో సమస్య పరిష్కరించాలని సంబంధిత అధికారికి ఆదేశాలు జారీ చేశారు. ఈలోగా సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడు నుంచి కలెక్టర్‌కు నివేదిక అందింది. ఇదే విషయమై అర్జీదారునికి లేఖ పంపారు. రెండు విద్యాలయాల్లో పిచ్చిమొక్కలు, తుప్పలు, డొంకలు, ఆటస్థలంలో రాళ్లు తొలగించినట్లు అందులో పేర్కొన్నారు. కెజిబివి, గురుకులం ప్రిన్సిపల్స్ స్వయాన చెప్పినట్లు వెల్లడించారు. కానీ నేటికీ ఆ మైదానాలను చదును చేయలేదు. కనీసం పిచ్చిమొక్కలు కూడా తొలగించలేదు. మైదానాలను చదును చేయించినట్లు తామెవరికీ చెప్పలేదని ప్రిన్సిపల్స్ 'ప్రజాశక్తి'కి చెప్పడం గమనార్హం.

ఎపిసిపై ఆగ్రహం

సమస్యను పరిష్కరించకుండా, కలెక్టర్‌ను తప్పుదోవ పట్టిస్తూ సమగ్ర శిక్ష ఎపిసి స్వామినాయుడు నివేదిక పంపించడంపై విద్యార్థుల తల్లిదండ్రులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. పేద కుటుంబాలకు చెందిన విద్యార్థుల కాబట్టే నిర్లక్ష్యం వహిస్తున్నారని, అధికారుల పిల్లలైతే ఇలాగే వదిలేస్తారా? అని మండిపడుతున్నారు. ఎవరికైనా, ఏదైనా జరగరానిది జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని ప్రశ్నిస్తున్నారు. వెంటనే కలెక్టర్ స్పందించి చర్యలు తీసుకోవాలని విద్యార్థులు తల్లిదండ్రులు, సామాజిక కార్యకర్త ఆర్.అప్పారావు కోరుతున్నారు.

అలా ఎలా నివేదిస్తారు?

పంచాయతీ పరిధిలోని బక్కునాయుడుపేట వద్దనున్న అంబేద్కర్ గురుకులం, మోడల్ పాఠశాలలో మైదానాల్లో పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. ఆటస్థలంలో బండరాళ్లు ఉన్నాయి. విషసర్పాలు సంచరించడంతో విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. విద్యార్థులు ఆటలాడేందుకు అవకాశం లేదు. ఏటా నా శక్తి మేర పిచ్చిమొక్కలు తొలగిస్తున్నా పెరుగుతున్నాయి. మైదానాల్లో డొంకలు, బండరాళ్లు లేవని సమగ్రశిక్ష ఎపిసి.. కలెక్టర్‌కు నివేదిక పంపడంలో వాస్తవం లేదు. వెంటనే మైదానాలను బాగుచేయాలి.

– మెల్లిపాక అర్జునమ్మ, సర్పంచ్, వేపాడ

డ్రైవర్‌కు ఫిట్స్.. అదుపుతప్పిన బస్సు

బాలుడు మృతి, మహిళకు గాయాలు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

శృంగవరపుకోట డిపో నుంచి ఆదివారం విజయనగరం వెళ్తున్న ఆర్‌టిసి బస్సు మండలంలోని ధర్మవరం వచ్చేసరికి డ్రైవర్‌కు ఫిట్స్ రావడంతో అదుపుతప్పింది. రోడ్డుపై వెళ్తున్న ఎస్.అభిషేక్ (12)ను ఢీకొనడంతో ఆ బాలుడు అక్కడికక్కడే మరణించాడు. ఎస్‌ఐ తారకేశ్వరరావు కథనం ప్రకారం..

మృతిచెందిన అభిషేక్

ఆదివారం ఉదయం సుమారు 8 గంటల సమయంలో శృంగవరపుకోట ఆర్‌టిసి డిపో నుండి ధర్మవరం మీదుగా విజయనగరం వెళ్తున్న బస్ డ్రైవర్ గంగునాయుడుకు అకస్మాత్తుగా ఫిట్స్ వచ్చింది. దీంతో ఆయన బస్సుపై నియంత్రణ కోల్పోయాడు. బస్సు అదుపుతప్పి ధర్మవరం వద్ద రోడ్డు పక్కనుండి నడుచుకుంటూ వెళ్తున్న సిరికి అభిషేక్‌ను బలంగా ఢీకొంది. అనంతరం ఇంటిలోకి దూసుకుపోవటంతో అక్కడ వంట చేస్తున్న తొత్తడి పాప అనే మహిళకు గాయాలయ్యాయి. ఇల్లు ముందుభాగం ధ్వంసమైంది. స్థానికులు 108కి ఫోన్ చేయడంతో స్థానిక ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షలు చేసి బాలుడు మృతిచెందినట్లు నిర్ధారించారు. డ్రైవర్‌కు, గాయాలైన మహిళకు చికిత్స అందిస్తున్నారు. అభిషేక్ పట్టణంలోని ప్రయివేటు పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. ఒక్క కొడుకు ఇలా అకస్మాత్తుగా చనిపోవడంతో తండ్రి గోవిందరావు, తల్లి కన్నీరుమున్నీరుగా విలపించారు. అభిషేక్ మృతితో ధర్మవరంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

బస్సు ఢీకొనడంతో ధ్వంసమైన ఇంటి ముందుభాగం

లైంగిక వేధింపులను అరికట్టాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బాలికలపై లైంగిక వేధింపులు అరికట్టాలని ఫోరం ఫర్ చైల్డ్‌రైట్స్ జిల్లా చైర్మన్ పి.చిట్టిబాబు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివారం స్థానిక డిబిఎస్‌యు కార్యాలయం లో లైంగిక వేధింపుల నుండి రక్షణ పొందేందుకు 'నా శరీరము – నా నియమాలు' అనే పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బాలల లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై ప్రజలకు, ఉపాధ్యాయులకు, ఆటో డ్రైవర్లకు, పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలకు అవగాహన కల్పించాలని కోరారు. బాలల వారోత్సవాల్లో భాగంగా సుమారు రెండువేల మంది పిల్లలకు అవగాహన కల్పించామని తెలిపారు. గర్ల్ చిల్డ్రన్ ఫోరమ్ ప్రతినిధి పి.అప్పలకొండ, జిల్లా విజిలెన్స్ అండ్ మోనిటరింగ్ సభ్యులు బుంగ భానుమూర్తి, డొమెస్టిక్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కోర్డినేటర్ కె.వరలక్ష్మి, జెఎంజె సంస్థ ప్రతినిది జొన్నాడ చిన్నారావు చేతుల మీదుగా పుస్తకాలు పంపిణీ చేశారు. బాలికా ప్రతినిధులు పెంకి చరణి, ఆర్.ప్రియ, ఎస్.దివ్య, కె.ధరణి, డిబిఎస్‌యు నాయకులు ఎన్.రమణ పాల్గొన్నారు.

కృష్ణారావుకు విజ్ఞాన గురు పురస్కారం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా సైన్స్ కోఆర్డినేటర్ డాక్టర్ మిరియాల కృష్ణారావుకు ఎపిజె అబ్దుల్ కలాం విజ్ఞాన గురు పురస్కారం దక్కింది. గుంటూరులో చివుకుల హనుమంతరావు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో ఇస్రో శాస్త్రవేత్త కె.రామ్మోహన రావు, మల్లికార్జునరావు, సి.హెచ్. సాంబశివరావు ఆయనకు పురస్కారాన్ని ప్రదానం చేవారు. విజ్ఞాన శాస్త్ర పాఠ్యబోధన, ఇన్‌స్పైర్, జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్, సైన్స్ ప్రదర్శనలో అనేక ప్రాజెక్టులు రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు పొందినందుకు, అనేక సేవలకు గుర్తింపుగా పురస్కారం లభించింది.



పురస్కారం అందుకుంటున్న కృష్ణారావు

ముగిసిన గ్రంథాలయ వారోత్సవాలు

నెల్లిమర్ల.. వారోత్సవాల ముగింపు సభలో మాట్లాడుతున్న రేగాన శ్రీనివాసరావు

ప్రజాశక్తి-నెల్లిమర్ల

నగర పంచాయతీ పరిధిలోని జరజాపుపేట గ్రంథాలయంలో లైబ్రరీ అధికారి జె.నారాయణమ్మ ఆధ్వర్యంలో ఆదివారం గ్రంథాలయ వారోత్సవ ముగింపు సభ నిర్వహించారు. జరిగిన కార్యక్రమంలో ఎపి టూరిజం డైరెక్టర్ రేగాన శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎంతో మంది ఉన్నతస్థాయిల్లో స్థిరపడ్డారంటే దానికి కారణం గ్రంథాలయాలని చెప్పారు. అనంతరం విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమాల్లో నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు, పోలుబోతు నారాయణమూర్తి, నల్లి శ్రీనివాసరావు సత్యనారాయణ, కడలి ప్రకాష్, సుంకర వాసుదేవరావు, రమేష్, మద్దిల వాసు మాస్టారు పాల్గొన్నారు.

విజయనగరంటౌన్ : గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు రెడ్డి పద్మావతి అన్నారు. థెరిసా క్లబ్‌లో గ్రంథాలయ వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా సరస్వతీ దేవి చిత్రపటానికి పూలమాలలు వేసి, జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అక్షర సమాజం పుట్టిన నాటి నుంచి గ్రంథాలయాలు జీవన వికాసానికి, సామాజిక పురోగతికి అవిరామ కృషి చేస్తున్నాయన్నారు. వివిధ పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ పార్వతీపురం మన్యం జిల్లా ఇంజినీరింగ్ అధికారి కృష్ణాజి, ప్రిన్సిపల్ స్వప్న హైందవి, ప్రముఖ రచయిత్రి చాగంటి తులసి, పాల్గొన్నారు.

బొబ్బిలి : స్థానిక శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన ముగింపు సభలో మున్సిపల్ చైర్మన్ సావు మురళీకృష్ణారావు పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో కౌన్సిలర్ రేజేటి విష్ణు, గ్రంథాలయ అధికారి ఎస్.స్వర్ణకుమారి పాల్గొన్నారు.

శృంగవరపుకోట : పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి బి.లక్ష్మి ఆధ్వర్యంలో ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సంతోషి కుమారి, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య జిల్లా గౌరవ అధ్యక్షురాలు మద్ది మాణిక్యం పాల్గొని, పోటీల్లో విజేతలకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో షేక్ చాంద్ బీబీ,పాల్గొన్నారు.

వేపాడ: స్థానిక శాఖా గ్రంథాలయంలో ముగింపు సభ నిర్వహించారు. ఈ సందర్భంగా పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు శ్రీవల్లి, అర్జునరావు, లైబ్రేరియన్ ఎస్.స్వామి నాయుడు పాల్గొన్నారు.

విజయనగరం కోట : గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలని కార్పొరేటర్ పి.ఆదినారాయణ తెలిపారు. గాజులరేగ శాఖ గ్రంథాలయంలో వారోత్సవాల ముగింపు సభలో ఆయనతోపాటు తెలుగు యువత సంఘం అధ్యక్షులు పి.రాము నాయుడు, మొయిదా నారాయణరావు మాట్లాడారు. అనంతరం లైబ్రేరియన్ ఎం.లక్ష్మణరావు ఆధ్వర్యాన విద్యార్థులకు బహుమతులు అందించారు.

గుర్ల.. విజేతకు బహుమతులు అందిస్తున్న నాయకులు

గుర్ల : స్థానిక గ్రంథాలయంలో లైబ్రేరియన్ పి.రామారావు అధ్యక్షతన వారోత్సవాల ముగింపు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వైసిపి జిల్లా ప్రధాన కార్యదర్శి కెవి సూర్యనారాయణ రాజు, జెడ్‌పిటిసి సీర అప్పలనాయుడు పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉజ్జిరోతు ప్రసాద్, సతివాడ సీతారాం, వైస్ ఎంపిపి తోట తిరుపతి రావు, దాసరి ఈశ్వరరావు, ఎల్.ఈశ్వరరావు పాల్గొన్నారు.

పుణ్యగిరిలో ట్రాఫిక్ జామ్

యాత్రికులకు ఇబ్బందులు

ప్రజాశక్తి-శృంగవరపుకోట

కార్తీక మాసం సందర్భంగా నిత్యం రద్దీగా ఉండే పుణ్యగిరిలో ఆదివారం సెలవు దినం కావడంతో యాత్రికులు అధిక సంఖ్యలో పోటెత్తారు. దీంతో పుణ్యగిరిలో యాత్రికులకు ఇబ్బందులు తప్పలేదు. దేవి బొమ్మ కూడలి నుంచి పుణ్యగిరి వరకు ట్రాఫిక్ జామ్ అయింది. పుణ్యగిరి దేవస్థానం చైర్మన్ పడమటి శెట్టి రామకృష్ణ, ఇఒ నాగేంద్ర చొరవతో ఎస్ఐ సిబ్బందితో అక్కడికి చేరుకుని, ట్రాఫిక్‌ను నియంత్రించారు.

గ్రామీణ విద్యార్థికి డాక్టరేట్

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్


విసి నుంచి డాక్టరేట్ పట్టా అందుకొంటున్న గౌరీశంకర్

మండలంలోని నారసింహునిపేటకు చెందిన పొదరాడ పొలయ్య, లక్ష్మీపార్వతి కుమారుడు గౌరీశంకరరావుకు డాక్టరేట్ లభించింది. ఆంగ్ల భాషా కరిక్యులమ్, సిలబస్‌పై విమర్శనాత్మక వివరణ అనే అంశంపై ప్రొఫెసర్ తాడ్డి నారాయణ పర్యవేక్షణలో చేసిన పరిశోధనకు గాను ఆయనకు ఎయు విసి ప్రసాద్‌రెడ్డి డాక్టరేట్‌ను అందించారు. గౌరీశంకరావు తండ్రి వ్యవసాయ కూలీ. తల్లి మధ్యాహ్న భోజన నిర్వాహకులు.

జామిలో కుప్పలు పెడుతున్న రైతులు

ముమ్మరంగా వరి కోతలు

ప్రజాశక్తి - జామి

మండలంలో వరి కోతలు ముమ్మరంగా సాగుతున్నాయి. రైతులు వరికోత పనుల్లో బిజీగా ఉన్నారు. మండలంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో 12,700 ఎకరాల్లో వరి సాగు చేశారు. సకాలంలో వర్షాలు కురవడంతో పంటలు బాగా పండాయి. ఈ నేపథ్యంలోనే నవంబర్ రెండో వారం నుంచే కోతలు ప్రారంభమయ్యాయి. ఇప్పటికే మండలంలో 500 ఎకరాల పైన కోతలు పూర్తి అయినట్లు ఎఒ కిరణ్ కుమార్ తెలిపారు. మరో 15 రోజుల్లో దాదాపుగా కోతలు పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయని చెబుతున్నారు. ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేయాలని రైతులు కోరుతున్నారు.

మదర్ థెరిస్సా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్

ఉచిత కేన్సర్ వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

కేన్సర్‌పై అవగాహన కలిగి ఉండడం అందరికీ అవసరమని నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి అన్నారు. ఆదివారం థెరిసా క్లబ్ ఆధ్వర్యంలో మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్స్, విజయనగరం ఇండియన్ మెడికల్ అసోసియేషన్ సంయుక్త నిర్వహణలో ఏర్పాటుచేసిన ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరాన్ని వారు ప్రారంభించారు. ఐఎంఎ రాష్ట్ర మాజీ అధ్యక్షులు డాక్టర్ విఎస్ ప్రసాద్, ఐఎంఎ రాష్ట్ర ఎలెక్టెడ్ అధ్యక్షులు డాక్టర్ జెసి నాయుడు, 39వ డివిజన్ కార్పొరేటర్ వి.ప్రభాకరరెడ్డి తదితరులు మాట్లాడారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఇసరపు రేవతిదేవి, క్యాంపు కోఆర్డినేటర్ డాక్టర్ జె శ్రీకాంత్, క్లబ్ అధ్యక్షులు పి.శంకరనారాయణ, డాక్టర్ ఎం.మృత్యుంజయరావు పాల్గొన్నారు.

సాదా బైనామాకు దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-వేపాడ

సాదాబైనామాల కోసం రైతులు గ్రామ సచివాలయాలలో దరఖాస్తులు చేసుకోవాలని తహశీల్దార్ కృష్ణంరాజు తెలిపారు. ఈ విషయంపై గ్రామాల్లో దండోరా వేయించనున్నట్లు తెలిపారు. ఆదివారం మండలంలో ఓటరు నమోదు కేంద్రాలను ఆయన పరిశీలించారు.

తాడయ్య మృతి తీరనిలోటు

ప్రజాశక్తి-గంట్యాడ

అంబేద్కర్ దళిత సేవా సంఘం మండల ఉపాధ్యక్షులు పందిరి తాడయ్య మృతి సంఘానికి తీరనిలోటని ఆ సంఘం అధ్యక్షులు వై.గురువులు అన్నారు. ఆదివారం కొటారుబిల్లి జంక్షన్‌లో తాడయ్య సంస్మరణ సభ నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. కార్యక్రమంలో చోళ మోహన్‌రావు, తెలుగు దుర్గారావు, వసంత చంద్రరావు, సిరిపురం దేవుడు, నిడిగట్టు నాగరాజు, రామవరం చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

శివడవలసలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

శివడవలస గ్రామంలో ఇటీవల మరణించిన శంబంగి ధనుంజయరావు జ్ఞాపకార్థం డిపి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏరా హెల్త్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణు గోపాల్‌నాయుడు ప్రారంభించారు.

పోలీస్ స్టేషన్‌ను సందర్శన

ప్రజాశక్తి-సీతంపేట

స్థానిక పోలీసు స్టేషన్‌ను పాలకొండ డిఎస్‌పి జివి కృష్ణారావు ఆదివారం సందర్శించారు. రికార్డులను పరిశీలించారు క్రైమ్ రేట్, స్టేషన్ పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. పరిసరాలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్సై ఎ.నీలకంఠరావు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

గుమ్మలక్ష్మీపురం : సిబ్బంది అన్ని వేళలో అప్రమత్తంగా ఉండాలని పాలకొండ డిఎస్పి జీవీ కృష్ణారావు సూచించారు. ఎల్విన్ పేట పోలీస్ స్టేషన్ ను ఆదివారం ఆకస్మిక తనిఖీ చేశారు. ఉద్యోగ బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా రావడంతో సిబ్బంది అప్రమత్తం అయ్యారు. రికార్డులు నిర్వహణ, పోలీస్ స్టేషన్ ఆవరణను పరిశీలించారు. పోలీసుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈయన వెంట సబ్ ఇన్స్పెక్టర్ షణ్ముఖరావు ఉన్నారు.

మన ఊరు - మన కళాశాల అ'పూర్వ' కలయిక

ప్రజాశక్తి-పాలకొండ రూరల్

స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన "మన ఊరు - మన కళాశాల అపూర్వ కలయిక" కార్యక్రమంలో ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిన్ననాటి స్నేహితులంతా ఒకే వేదికపై కలుసుకోవడం, ఆత్మీయంగా పలకరించుకోవడం సంతోషించదగ్గ విషయం అన్నారు.ఈ కళాశాలలో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులు, ఉపాధ్యాయులంతా ఒక ఆత్మీయ కలయికగా కలిసి మన ఊరు, మన కళాశాల అభివృద్ధి గురించి తమదైన పాత్ర పోషించాలని నిర్ణయించుకున్నారు. అందరూ కలిసి సరదాగా ముచ్చటించుకున్నారు.

టిడిపికి ఆఖరి ఎన్నికలు

ఎమ్మెల్యే శంబంగి

ప్రజాశక్తి-బొబ్బిలి

2024లో జరిగే ఎన్నికలే టిడిపికి ఆఖరివని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. వైసిపి కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో పరాభావం తప్పదని భావించి మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు మతిభ్రమించి మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. కర్నూలు పర్యటన, టిడిపి సర్వసభ్య సమావేశంలో చంద్రబాబు అసహనం స్పష్టంగా కనిపిస్తుందన్నారు. బాధ్యతారాహిత్యంగా మాట్లాడుతున్న చంద్రబాబుకు క్షేత్రస్థాయిలో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు. మహిళలను రెచ్చగొట్టే విధంగా జనసేన అధినేత పవన్ కళ్యాణ్ మాట్లాడుతున్నారని విమర్శించారు. విశాఖలో మోడీ పర్యటన తర్వాత టిడిపి, జనసేన గ్రాఫ్ తగ్గిందన్నారు. రాజధాని పాదయాత్రలో రైతుల ముసుగులో టిడిపి నేతలు అభివృద్ధి వికేంద్రీకరణను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు. మూడు రాజధానులు ప్రకటించిన తర్వాత జరిగిన మున్సిపల్, స్థానిక సంస్థలు ఎన్నికల్లో వైసిపి భారీ మెజారిటీతో ప్రజలు గెలిపించారంటే, దేనికి అనుకూలంగా ఉన్నారో అర్థం చేసుకోవచ్చన్నారు. సమావేశంలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ, వైసిపి నాయకులు బి.కాశీనాయుడు, చోడిగంజి రమేష్ నాయుడు పాల్గొన్నారు.

రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ప్రజలు ఊరుకోరు

నెల్లిమర్ల : మాజీ సిఎం చంద్రబాబు రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే ప్రజలు ఊరుకోరని ఎమ్మెల్సీ పి.సురేష్‌బాబు చెప్పారు. ఆదివారం నెల్లిమర్ల ప్రెస్‌క్లబ్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. కర్నూలులో చంద్రబాబు ప్రసంగంలో విచక్షణ మరిచారన్నారు. 'తరిమి తరిమి కొడతా, బట్టలిప్పేసి కొడతా, నేను గుండాలకు గూండాని, రౌడీలకు రౌడీని' లాంటి చంద్రబాబు వ్యాఖ్యలు రాష్ట్రంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఉన్నాయన్నారు. అంతేకాకుండా పోలీసులు, అధికారులను బెదిరించడం ఆయన రాజకీయ దిగజారుడుతనానికి నిదర్శనమని విమర్శించారు. చంద్రబాబు 40 ఏళ్ల అనుభవం ఉన్న నాయకుడిలా, మాజీ ముఖ్యమంత్రిలా కాకుండా ఓ రౌడీషీటర్లా మాట్లాడుతున్నారని ఆరోపించారు. ప్రజాస్వామ్యంలో నిరసన తెలియజేసే హక్కు ప్రజలందరికీ ఉందని, 'చంద్రబాబు గో బ్యాక్' అన్నందుకే తీవ్ర పదజాలంతో అక్కడి ప్రజలపై విరుచుకు పడడం దారుణమన్నారు.

సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు..

ఎమ్మెల్యే కడుబండి

ప్రజాశక్తి - జామి

లబ్ధిదారులకు పథకాల గురించి వివరిస్తున్న ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ప్రజా సమస్యలు తెలుసుకునేందుకే గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు తెలిపారు. ఆదివారం మండల కేంద్రంలోని మాధవరాయమెట్ట గ్రామంలో ఎమ్మెల్యే ఆధ్వర్యాన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు, సచివాలయ సిబ్బంది, వాలంటీర్లతో కలిసి పర్యటిస్తూ గడప గడపకు వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు వివరించారు. స్థానికంగా ఉండే సమస్యలపై ఆరా తీసి వాటిని వెంటనే పరిష్కరించాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జెడ్‌పిటిసి గొర్ల సరయు, వైసిపి మండల కన్వీనర్ గొర్ల రవికుమార్, వైస్ ఎంపిపి గేదెల వెంకటరావు, అల్లు సత్యాజి, అల్లు పద్మ, ఆంద్ర గోపాలకృష్ణ, సర్పంచ్ చిప్పాడ లక్ష్మి, వేచలపు అంజీ, చింతాడ సుబ్రమణ్యం, విజినిగిరి సర్పంచ్ సూర్యారావు, రామయపాలెం సత్యం, వాక నాగరాజు, నెక్కల సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసిక ఉల్లాసం

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

క్రీడలతోనే మానసిక ఉల్లాసం లభిస్తుందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు అన్నారు. ఆదివారం పక్కి గ్రామంలో నియోజకవర్గ స్థాయి కబడ్డీ, వాలీబాల్ సెలక్షన్స్ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాష్ట్ర స్థాయిలో సత్తాచాటి నియోజకవర్గానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. క్రీడల్లో పాల్గొన్న క్రీడాకారులకు ఆయన వాలీబాల్ కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు శంబంగి వేణుగోపాలనాయుడు, సర్పంచ్ పైడిరాజు, ఉప సర్పంచ్ అల్లు రామూర్తి, ప్రధాన ఉపాధ్యాయులు జివిఎస్ఎన్ మూర్తి, స్కూల్ చైర్మన్ బంకురు శంకర్రావు, ఎంపిడిఒ అల్లు భాస్కర్ రావు, ఎంఇఒ చల్లా లక్ష్మణరావు పంచాయతీ కార్యదర్శి పక్కి మధుసూదన్ రావు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రిబ్బన్ కట్ చేసి పోటీలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బాలల భద్రత.. ప్రతిఒక్కరి బాధ్యత

బొబ్బిలిరూరల్.. విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న జెసి రాజు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

బాలల రక్షణ, భద్రత ప్రతి ఒక్కరిపైనా ఉందని రోటరీ క్లబ్ అధ్యక్షులు జె.సి.రాజు అన్నారు. ఆదివారం ప్రపంచ బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా రోటరీ, కారుణ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో నారాయణప్పవలస పాఠశాలలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రతి దేశానికి బాలలే తరగని సంపదని ఆయన చెప్పారు. వారి రక్షణ, భద్రతపై సమాజంలో ఉన్న ప్రతివారు బాధ్యత వహించాలన్నారు. బాలల సంపూర్ణ వికాసానికి, అభివృద్ధికి వారి హక్కుల పరిరక్షణ అవసరమని అన్నారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శి పార్వతి పాల్గొన్నారు.

మానవ సేవే మాధవసేవ

వేపాడ : మానవ సేవే మాధవ సేవని ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ పైడిరాజు తెలిపారు. మండల కేంద్రంలో బాలల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడారు. బాలల హక్కులను కాలరాయవద్దని కోరారు. అంతకంటే మనం బాలలకు చేయాల్సిన సహాయం ఇంకేమీ లేదన్నారు.

అలరించిన చిన్నారుల ఆనందోబ్రహ్మ

బొబ్బిలి : కళాభారతి ఆడిటోరియంలో ఆదివారం నిర్వహించిన చిన్నారుల ఆనందోబ్రహ్మ కార్యక్రమం అలరించింది. కళలను, కళాకారులను ప్రోత్సహించేందుకు యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ ఆధ్వర్యంలో గత కొన్ని నెలలుగా ఆనందోబ్రహ్మ కార్యక్రమం నిర్వహిస్తున్నారు. ఈవారం చిన్నారులతో ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో చదువుతున్న చిన్నారులు సినీ, జానపద గీతాలకు నృత్యాలు చేసి అలరించారు. ఆనందోబ్రహ్మ చూసేందుకు అధిక సంఖ్యలో ప్రజలు హాజరయ్యారు. ఆనందోబ్రహ్మను ఎస్ఇబి ఇన్స్పెక్టర్ ఆర్.జైభీమ్ ప్రారంభించారు. కార్యక్రమంలో యంగ్ మెన్స్ హ్యాపీ క్లబ్ అధ్యక్షులు ఎం.విజయమోహన్, టి.వి.రమణ, ఎన్.వేణుగోపాల్, చింతా శారద, తదితరులు పాల్గొన్నారు.

పిరమిడ్ ఆకృతిలో విద్యార్థుల ప్రదర్శన

భద్రతా నియమాలతోనే ప్రమాదాల నివారణ

బాడంగి.. హోంగార్డు కృష్ణను సన్మానిస్తున్న ఎస్ఐ జయంతి, ఎఎస్ఐలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

రహదారి భద్రతా నియమాలతోనే ప్రమాదాలను నివారించవచ్చని ఒకటో పట్టణ సిఐ వెంకటరావు తెలిపారు. వరల్డ్ రిమంబరెన్స్ డే సందర్భంగా ప్రమాదాల నియంత్రణకు సహకారాన్ని అందించే ఆటో డ్రైవర్లు, క్షతగాత్రులకు సహాయపడే ప్రజలు, వైద్యం అందించే వైద్యులు, రహదారి భద్రత పట్ల అవగాహన కల్పించేందుకు కృషి చేసిన పత్రిక ప్రతినిధులను ఆయన అభినందించి, సత్కరించారు. ప్రమాద రహిత సమాజం కోసం ప్రతిఒక్కరూ రహదారి భద్రత నియమాలు పాటించాలని సిఐ కోరారు. ఈ కార్యక్రమంలో తిరుమల మెడికవర్ వైద్యులు, ఒకటో పట్టణ ఎస్ఐలు అశోక్, విజయ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

నెల్లిమర్ల : రహదారి భద్రత నియమాలతో ప్రమాదాల నివారణ సాధ్యమని ఎస్ఐ పి.నారాయణ రావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్లో ఆటో డ్రైవర్లు, క్షతగాత్రులకు సహాయపడే ప్రజలు, వైద్యం అందించే వైద్యులు, రహదారి భద్రత పట్ల ఎస్ఐ అవగాహన కల్పించారు.

సేవలకు గుర్తింపు

బాడంగి : పోలీస్ స్టేషన్లో హోంగార్డుకు విధులు నిర్వహిస్తున్న చప్ప కృష్ణను ఎస్ఐ జయంతి, సిబ్బంది సన్మానించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ నిత్యం పోలీస్ స్టేషన్‌లో ప్రజలకు అందుబాటులో ఉంటూ చేసిన సేవలకు గాను కృష్ణను సన్మానించినట్లు తెలిపారు. కృష్ణను పలువురు నాయకులు, సిబ్బంది అభినందించారు. కార్యక్రమంలో ఎఎస్ఐ కొండలరావు, స్వామి, సిబ్బంది అనిల్, వైకుంఠ రావు పాల్గొన్నారు.

రేగిడి : ఉంగరాడ మెట్ట పోలీస్ స్టేషన్ ఆవరణలో ఉంగరాడ గ్రామానికి చెందిన రామును ఎస్ఐ శ్రీనివాసరావు సత్కరించారు. ప్రమాదాలు జరిగినప్పుడు రాము ఎప్పటికప్పుడు పోలీసులకు సమాచారం ఇవ్వడం అభినందనీయమని ఎస్ఐ తెలిపారు.

'స్నేహ' ఆధ్వర్యాన రగ్గులు పంపిణీ

ప్రజాశక్తి-శృంగవరపుకోట

స్నేహ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో పుణ్యగిరిలోని గిరిజనులకు ఆదివారం రగ్గులను పంపిణీ చేశారు. ఈ రగ్గులను ఢిల్లీ జిఎస్‌టి కార్యదర్శి సుమిడా దేవి, వెన్నకోట ప్రసాద్ సహకారంతో అందించారు. కార్యక్రమంలో సంస్థ కార్యదర్శి మంథా సుబ్బారావు, సభ్యులు ఎంఎస్ఎన్ మూర్తి, డాక్టర్ త్రినాథరావు, విన్నకోట ప్రసాద్, వి.మురళి, పీడీ పొట్నూరు శ్రీరాములు పాల్గొన్నారు.

జిఒ 52తో తీవ్ర నష్టం

ఎరుకలి సేవా సంఘం సమావేశంలో రాష్ట్ర అధ్యక్షులు శ్రీనివాసరావు

ప్రజాశక్తి-బాడంగి

పాలవలస గౌరు, పార్వతిని సన్మానిస్తున్న సంఘం నాయకులు

రాష్ట్రంలోని బోయ, వాల్మీకి, బెంతు ఒరియాలను ఎస్‌టిలో కలపడానికి సంబంధించిన జిఒ నంబర్ 52ని రాష్ట్ర ప్రభుత్వం ఉపసంహరించుకోవాలని ఎరుకలి సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షులు పాలపర్తి శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని ఎరుకలిపాకలులో ఎరుకలి సేవా సంఘం జిల్లా అధ్యక్షులు, ఎంపిటిసి పాలవలస గౌరు ఆధ్వర్యాన కార్తీక వన సమ్మేళనం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిఒ నెంబర్ 52తో ఎరుకలి కులస్తులకు తీరని అన్యాయం జరుగుతుందని చెప్పారు. అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిన బోయ, వాల్మీకి, బెంతు ఒరియా కులస్తులను ఎస్‌టిలో కలపొద్దని కోరారు. అనంతరం పాలవలస గౌరు మాట్లాడుతూ తనను చాలా మంది ఇబ్బంది, తమ ఉపాధిపై దెబ్బకొట్టారని, ఉపాధి లేక అనేక మంది వలసలు వెళ్లిపోతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఎరుకలి సామాజిక తరగతి ప్రజల సమస్యలపై ఐక్యంగా ముందుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఉదయం నుంచి ప్రారంభమైన వన సమ్మేళనం కార్యక్రమంలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. అనంతరం జిల్లా అధ్యక్షులు పాలవలస గౌరు, సర్పంచ్ పార్వతిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు గేదెల లక్ష్మణ, కార్యదర్శి గేదెల సత్తిబాబు, గేదెల మోహన్, మహిళా కార్యదర్శి దాసరి నారాయణమ్మ, శ్రీకాకుళం జిల్లా కార్యదర్శి గేదెల సత్యం, ఉత్తరాంధ్ర జిల్లాల అధ్యక్షులు దాసరి అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షుడు పాలవలస పైడితల్లి, కార్పొరేటర్ దాసరి సత్యవతి, నాయకులు పివి గాయత్రిదేవి, తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావు కాంస్య విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-రేగిడి

శ్రీనివాసరావు కాంస్య విగ్రహావిష్కరణలో పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు

కందిస గ్రామానికి చెందిన ఎస్‌డిఆర్‌పి 5వ బెటాలియన్ పోలీస్‌గా పనిచేసి నెల్లూరు వరదల్లో చిక్కుకుని మృతి చెందిన కెల్ల శ్రీనివాసరావుకు ప్రథమ వర్ధంతిని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కాంస్య విగ్రహాన్ని ఎమ్మెల్యే కంబాల జోగులు, ఎమ్మెల్సీ పాలవలస విక్రాంత్ ఆవిష్కరించారు. సభలో వారు మాట్లాడుతూ దేశం కోసం, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులు ఎప్పటికీ హీరోలనేని అన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు కుటుంబ సభ్యులకు పదివేల రూపాయలు సాయం ప్రకటించారు. ఎమ్మెల్యే కంబాల జోగులు కుటుంబ సభ్యులను అన్ని విధాలుగా ఆదుకుంటానని హామీ ఇచ్చారు. పెన్షన్ స్కీం కింద 20 వేల రూపాయలు చెక్కును శ్రీనివాసరావు భార్య కెల్ల సునీత, తల్లిదండ్రుల వరహాల నాయుడు, గౌరీశ్వరికి అందజేశారు. 5వ బెటాలియన్ ఆర్ఐ చంద్రశేఖర్, పోలీస్ అకాడమీ అధ్యక్షులు ఎం. అప్పలనాయుడు మాట్లాడుతూ విధి నిర్వహణలో మృతి చెందిన శ్రీనివాసరావు కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.25 లక్షలు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి వావిలపల్లి జగన్మోహన్రావు, ఎంపిడిఒ గన్నవరపు కాశీ విశ్వనాథరావు, వైసిపి నాయకులు కెల్ల మన్మథరావు, కెంబూరు వెంకటేశ్వరరావు, కే శ్రీనివాసరావు, కరణం గోవిందరావు, టంకాల ఉమా పాపి నాయుడు, బియ్యపు చక్రపాణి, నెల్లి పెంటం నాయుడు, వంగర జెడ్‌పిటిసి సుదర్శన్ రావు పాల్గొన్నారు.

అప్పలనాయుడు సేవలు వెలకట్టలేనివి

జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి

ప్రజాశక్తి-శంగవరపుకోట

ఈ నెలలో ఉద్యోగ విరమణ చేయనున్న సెకెండ్ క్లాస్ మెజిస్ట్రేట్ జి.అప్పలనాయుడు సేవలు వెలకట్టలేనివని జూనియర్ సివిల్ జడ్జి సబ్బవరపు వాణి కొనియాడారు. కాపుసోంపురం గ్రామంలో న్యాయవాదుల వనసమారాధన కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదుల సంఘ అధ్యక్షులు అల్లు సత్యాజీ అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో అప్పలనాయుడు సేవలను కొనియాడారు. కార్యదర్శి కెవిఎస్ రామరాజు, సీనియర్ న్యాయవాది డబ్ల్యు.ఎన్. శర్మ, కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మండా కామేశ్వరరావు, జి.సూరిదేముడు, గేదెల ప్రకాష్, బి.త్రిమూర్తులు, వారాది ఈశ్వరరావు, టివిఆర్ మూర్తి, జూనియర్ సివిల్ జడ్జి తల్లిదండ్రులు శ్రీరామమూర్తి, సత్యవతి, న్యాయవాదులు పాల్గొన్నారు.

బహిరంగ ప్రకటన

విజయనగరం జిల్లా, బొబ్బిలి మున్సిపాలిటీ, స్వామివారివీధి కా॥ న్యాయవాది అమరాపు రామకృష్ణ, వారి యింటి (స్థలము+GF+1st F) రిజిష్టరీ క్రయ దస్తావేజులు పోయినవి. ఎవరికైనా దొరికిననూ ఈ క్రింది అడ్రసుకు అందజేయగలరు.
(1) Ducument No. 2096/1991 (29-12-1991)
(2) Ducument No. 1957/1994 (23-05-1994), S.No. 76-1 (మల్లమ్మపేట రెవెన్యూ) సదరు విషయమై పోలీసు రిపోర్టు కూడా యిచ్చియున్నాము. సదరు డాక్యుమెంట్లు అందజేసిన వారికి తగిన పారితోశకము యివ్వబడును.

అమరాపు రామకృష్ణ,
అడ్వకేట్,
Door No. 341,
స్వామివారివీధి, (1st Line),
బొబ్బిలి, సెల్ : 94917 68409